పేదలకు వరం సీఎం సహాయ నిధి

● ఎమ్మెల్యే వేముల వీరేశం


బాధితుడికి ఎల్ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, జనవరి 18 : సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన బసవోజు ఝాన్సీకి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని గురువారం నకిరేకల్‌లో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహయాదవ్, నాయకులు శ్యామల శ్రీనివాస్, నర్సింహచారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న శాకాహార జంతు గణన

చందంపేట, జనవరి 18 : నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శాఖాహార జంతు గణన గురువారం కొనసాగింది. మండలంలోని పాగిళ్ల, కంబాలపల్లి, పాత కంబాలపల్లి, రేకులవలయం గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో చేపడుతున్న జంతు గణన వివరాలను ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ పరిశీలించారు. వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు జంతు గణన కొనసాగుతుందన్నారు. అటవీ ప్రాంత సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓ సాయి ప్రకాశ్, సిబ్బంది ఉన్నారు.

తూకాల్లో మోసానికి పాల్పడితే చర్యలు

● తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

కాంటాను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్

కొండమల్లేపల్లి, జనవరి 18 : తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం దేవరకొండ పట్టణంలోని కూరగాయాలు, చికెన్, మటన్ షాపులు, పత్తి కొనుగోలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా తూకాల్లో హెచ్చుతగ్గులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వినియోగదారులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలి

● ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ

నల్లగొండ రూరల్, జనవరి 18 : మత్స్యకారుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత చేప పిల్లల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కులవృత్తులకు పూర్వవైభవం తెచ్చేందుకు మాజీ సీఎం కేసీఆర్ రజక, నాయీబ్రాహ్మణ, గొర్రెల పెంపకదారులు, గీతకార్మికులు, మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 47 వేల చెరువుల్లో 6,800 మత్స్యకార సొసైటీల ద్వారా ఉచిత చేప పిల్లల్ని అందించాలని కోరారు. అలాగే మత్స్యకారుల అభివృద్ధి నిధులు రూ.104 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్ల పట్టివేత

మిర్యాలగూడ, జనవరి 18: పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీలోని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 45మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎక్సైజ్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. రవీంద్రనగర్ కాలనీకి చెందిన పున్నా శివ, పున్నా రాకేశ్ గోవా నుంచి తీసుకొచ్చిన 45 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లు తమ ఇంట్లో నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడిచేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరు గోవా నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. పున్నా శివను అరెస్ట్ చేయగా.. రాకేశ్ పరారీలో ఉన్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్ఐలు పర్వీన్, లావణ్య, రామకృష్ణ ఉన్నారు.

ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి పథకం

● ఎంపీపీ శ్వేత, జడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

నాంపల్లి, జనవరి 18 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆడబిడ్డలకు వరం లాంటివని ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతారవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుంగపాడ్, పెద్దాపురం గ్రామాల్లోని పలువురికి ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మితో ఎన్నో కుటుంబాల తల్లిదండ్రులు తమ ఆడబిడ్డల పెండ్లిళ్లను ధైర్యంగా చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దండిగ అలివేలునర్సింహ, జిల్లెల యాదమ్మసైదులు, ఎంపీటీసీ సప్పిడి సరితాశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

INDUSIND BANK
CFD Light Commercial Vehicle for Sale
EICHER Pro 2114XP BSVI
Model 2023-TS29TB4532
D.No. 797, Bharath Reddy Complex, Main Road, Kodad-508206.
Suryapet (Dist).
Cell: 9848816816

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

22న బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, జనవరి 18: ఈ నెల 22న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగే నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశానికి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరు కావాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కోరారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ ఎన్నికలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు వివరించారు. సమావేశానికి మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి వంద మంది తరలి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ఎన్‌టీఆర్

మిర్యాలగూడ : పేద ప్రజల అభ్యున్నతికి దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ.రామారావు ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెర్రిపోతుల రాములుగౌడ్, పునాటి లక్ష్మీనారాయణ, అరుణ్‌కుమార్, కూనల గోపాలకృష్ణ, పరిమి రామావతారం, అన్నపర్తి గంగాధర్, సాధినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

21వరకు టీజీవీసీఈటీ దరఖాస్తుల గడువు

రామగిరి, జనవరి 18 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీసీఈటీ)ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 21 వరకు పొడిగించినట్లు చర్లపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సుల్తానా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం ఆయా విభాగాల్లో నాలుగో తరగతి చదివే బాలబాలికలు ఈ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు https://tgcet.cgg.gov.inలో సంప్రదించాలని సూచించారు.

పాస్టర్స్ అసోసియేషన్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

మిర్యాలగూడటౌన్, జనవరి18: పట్టణంలోని నందిపహాడ్ బేతేలు న్యూలైఫ్ చర్చిలో గురువారం జరిగిన సమావేశంలో పాస్టర్స్ అసోసియేషన్ కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేరం ఇమ్మాన్యుయేలు, ఉపాధ్యక్షుడిగా పెరుమాళ్ల ఎలీషా, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలుగా బట్టగాని సంజీవరావు, దుగ్గె బెంజిమన్, కోశాధికారిగా పెరుమాళ్ల ఆనంద్, గౌరవాధ్యక్షులుగా ఏసురత్నం, జానయ్య, పేరందాసు ఎన్నికయ్యారు. సంఘం నాయకులు ముళ్లగిరి కాంతయ్య, కాశిమళ్ల విక్టర్, చిలుక విద్యాసాగర్, ప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాలి

కొండమల్లేపల్లి, జనవరి 18 : రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులందరూ ఈ నెల 31 వరకు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని తాసీల్దార్ దివ్వారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు యజమానితో పాటు కుటుంబ సభ్యులు రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ పాస్ మిషన్ ద్వారా వేలిముద్ర వేయాలని పేర్కొన్నారు. ఈకేవైసీ నమోదు చేసుకోని పక్షంలో రేషన్ కార్డు రద్దవుతుందని స్పష్టం చేశారు.

20 నుంచి జిల్లా స్థాయి షటిల్ డబుల్స్ పోటీలు

నకిరేకల్, జనవరి 18 : మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య జ్ఞాపకార్థం నకిరేకల్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి షటిల్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు స్టేడియం కమిటీ అధ్యక్షుడు కొండ యాదగిరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ హాజరుకానున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9848316459, 9030687019 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అతిథి అధ్యాపకుల వినతి

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

రామగిరి, జనవరి 18 : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ ఎన్‌జీ కళాశాల అతిథి అధ్యాపకుడు నర్సింగ్ శంకర్ మాట్లాడుతూ.. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పని చేస్తున్న తమకు సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. సంవత్సరంలో 8 నెలలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ అధ్యాపకులతోపాటు సమానంగా 12 నెలలపాటు వేతనాలు అందించేలా చూడాలని, తన సర్వీసులను ప్రతి సంవత్సరం ఆటో రెన్యూవల్ చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సైతం కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన గిరి, వెంకట్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

● ఆర్డీఓ చెన్నయ్య

మాట్లాడుతున్న ఆర్డీఓ

మిర్యాలగూడ, జనవరి 18: మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆర్డీఓ చెన్నయ్య తెలిపారు. గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో 30,885, రూరల్ పరిధిలో 23,378, వేములపల్లి మండలంలో 9,455, దామరచర్ల 16,882, మాడ్గులపల్లి 6,915, అడవిదేవులపల్లి మండల పరిధిలో 6,284 దరఖాస్తులు రాగా వాటిని ఆన్‌లైన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఓటర్ల జాబితా సవరణ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడ్రస్ మార్పు, ఓటు ట్రాన్స్‌ఫర్ వంటి వాటిని ఫాం-8 ద్వారా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలకు దరఖాస్తులను అందించవచ్చన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు హాలియా విద్యార్థి

ఎండీ అఫ్షా

చింతల హనుమాన్

హాలియా, జనవరి18 : అండర్ -14 జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు హాలియాలోని వీఎస్ఆర్ పాఠశాల విద్యార్థి ఎండీ అఫ్షా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివర్ల వెంకటయ్య తెలిపారు. ఈ నెల 16,17,18 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనగాంలో జరిగిన 67వ స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున ఆడిన అఫ్షా చక్కటి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దవూర విద్యార్థి

పెద్దవూర : రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు స్థానిక న్యూవిజన్ కళాశాల విద్యార్థి చింతల హనుమాన్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్కే. రషీద్ తెలిపారు. ఈ నెల 11 నుంచి 14 వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో హనుమాన్ పాల్గొని ప్రతిభ కనబర్చడంతో అతడిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో హనుమాన్‌ను అబ్బాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ షేక్ అబ్బాస్, సిబ్బంది అభినందించారు.

రంగురాళ్ల వ్యాపారం చేస్తున్న ముగ్గురి బైండోవర్

అడవిదేవులపల్లి, జనవరి 18: రంగురాళ్ల వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు నిందితులను గురువారం తాసీల్దార్ శ్రీరాం సురేశ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జిలాని తెలిపారు. మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర్లు, కొమ్ము మల్లయ్య, తుమ్మల కొండల్ గ్రామ శివారులోని కృష్ణా నదిలోంచి రంగురాళ్లను సేకరించి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణల నేపథ్యంలో వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం తాసీల్దార్ వారిని రూ. లక్ష పూచీకత్తుతో విడుదల చేసినట్లు తెలిపారు.

మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో శ్రీ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

హాలియా: ప్రతిభ కనబర్చిన శ్రీ విద్యాలయం విద్యార్థులు

హాలియా, జనవరి 18 : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో మండలంలోని పులిమామిడి స్టేజీ వద్ద ఉన్న శ్రీ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ జిల్లా మహేందర్ తెలిపారు. విద్యార్థులు అభి, జ్ఞానేశ్వరి, విశ్వ, బిందుశ్రీ, హేమంత్, తరుణ్, వర్షిత్‌కుమార్, యశ్మిత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

నల్లగొండ : ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన ఓక్‌ట్రీ విద్యార్థులు

నల్లగొండ ఓక్‌ట్రీ విద్యార్థుల ప్రతిభ

నల్లగొండ : అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో జిల్లా కేంద్రానికి చెందిన ఓక్ ట్రీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఒలంపియాడ్ మొదటి లెవల్‌లో పాల్గొనగా 34 మంది మెరుగైన ఫలితాలు సాధించి సెకండ్ లెవల్‌కు అర్హత పొందినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.

బెల్టు షాపులు మూసేయాలని కొరటికల్ గ్రామస్తుల ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

మునుగోడు, జనవరి 18 : మండలంలోని కొరటికల్ గ్రామంలో బెల్టు షాపులు మూసివేయాలని గ్రామస్తులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇటీవల మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా బెల్టుషాపులు మూసివేయాలని ఇచ్చిన పిలుపు మేరకు గ్రామస్తులు స్పందించి 25 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. గురువారం ఈ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి గ్రామంలో బెల్టు షాపులు తొలగించాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, నాయకులు భీమనపల్లి సైదులు, పాల్వాయి చెన్నారెడ్డి, జాల వెంకటేశ్వర్లు, కున్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, దండు లింగస్వామి, నక్క లింగస్వామి, నక్క వెంకన్న, చిలువేరు ధనమ్మ, అద్దంకి కృష్ణమ్మ, బొడ్డుపల్లి రాజేశ్వరి పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

నకిరేకల్, జనవరి 18 : నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్-1 అతిథి అధ్యాపక పోస్టుకు ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీతోపాటు బోధనలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పీజీలో 50 శాతం మార్కులు, ఓసీ, బీసీ అభ్యర్థులు 55 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఆర్టిజన్ జూనియర్ లైన్‌మన్ల సమస్యలు పరిష్కరించాలి

● 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న

నల్లగొండ సిటీ, జనవరి 18 : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ జూనియర్ లైన్‌మన్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మనగోటి వెంకన్న కోరారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌కోలో పని చేస్తున్న కిందిస్థాయి ఉద్యోగులను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 2 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు ఇంక్రిమెంట్, పెయిడ్ హాలిడేస్ ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూతనంగా విధుల్లో చేరిన జూనియర్ లైన్‌మన్లు ఆకర్షితులై యూనియన్‌లో చేరడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, సాయిబాబా, తులసీరామ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

వెంకన్న కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

నార్కట్‌పల్లి, జనవరి 18 : మండలంలోని తొండల్‌వాయి గ్రామానికి చెందిన మేడిపల్లి వెంకన్న గుండెపోటుతో మృతి చెందాడు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట చింత ప్రమీల, సుధాకర్ ఉన్నారు.

రేషన్ సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలి : తాసీల్దార్

నిడమనూరు, జనవరి 18 : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాల్సిన సరుకులను పారదర్శకంగా పంపిణీ చేయాలని తాసీల్దార్ జంగాల కృష్ణయ్య ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధరైజేషన్ లైసెన్స్‌ను క్రమం తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. రేషన్ దుకాణాల్లో బోర్డులపై స్టాకు వివరాలను విధిగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయబ్ తాసీల్దార్ రషీద్, సీనియర్ అసిస్టెంట్ సందీప్, రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షురాలు కందుల సైదమ్మ, డీలర్లు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

మర్రిగూడ, జనవరి18 : మండలంలోని యరగండ్లపల్లిలో సంక్రాంతి సందర్భంగా ముత్యాలమ్మ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు వల్లంల సంతోష్‌యాదవ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వారం రోజులపాటు జరిగిన పోటీలు గురువారం ముగిశాయి. కాగా, ఫైనల్‌లో విజయం సాధించిన టీమ్‌కు రూ.15వేల నగదు, ద్వితీయ బహుమతి పొందిన టీమ్‌కు రూ.7,500 నగదుతోపాటు ట్రోపీలు అందజేశారు.

మిషన్ భగీరథ నీరు అందించాలని కలెక్టర్‌కు వినతి

నార్కట్‌పల్లి, జనవరి18 : మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరు అందించాలని, పైప్‌లైన్ పనులు పూర్తిచేయాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ హరిచందనకు నార్కట్‌పల్లి పట్టణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

దేవరకొండరూరల్, జనవరి 18 : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మర్రిచెట్టు తండా సర్పంచ్ శ్రీనునాయక్ కోరారు. తండాలో గురువారం సీడబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలపై వివక్ష, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. సంస్థ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీఎల్ కంపెనీ వద్ద ఉద్రిక్తత

● కంపెనీ సామర్థ్యం పెంపును నిరసిస్తూ గ్రామస్తుల ఆందోళన

ఎంపీఎల్ కంపెనీ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు

చిట్యాల, జనవరి 18 : మండలంలోని వెల్మినేడు శివారులో గల ఎంపీఎల్ కంపెనీ వద్ద గురువారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కంపెనీ యాజమాన్యం కంపెనీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నది. ఈ నేపథ్యంలో ఈనెల 19న ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రభుత్వం నుంచి అనుమతి రాగా కంపెనీ వారు అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు కెమికల్ కంపెనీలతోపాటు ప్రస్తుతం ఉన్న ఎంపీఎల్ కంపెనీ నుంచి వస్తున్న కాలుష్యంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపీఎల్ కంపెనీ వెదజల్లే కాలుష్